www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 మే 2024
8 పేజీలు



వైఎస్ఆర్



అన్నమయ్య

కాంగ్రెస్‌తోనే.. 'ఉక్కు' కల సాకారం



బహిరంగ సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

- రాజ్యాంగంతోనే హక్కుల పరిరక్షణ
- పనికిరాని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎందుకు?
- బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న రాహుల్ గాంధీ, వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎఐసిసి నాయకులు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో పిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి బిజెపి ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఇచ్చిన హామీలన్నింటినీ వంద శాతం నెరవేర్చుతుందని చెప్పారు. వైఎస్ఆర్ నా తండ్రికి సోదరుడని తెలిపారు. రాజీవ్, వైఎస్ఆర్ బంధం అన్నదమ్ముళ్ల బందం. ఈ బంధం చాలా ఏళ్ల కిందటి నుంచి ఉందని తెలిపారు. వైఎస్ఆర్ పాదయాత్ర స్ఫూర్తితో భారత్‌జోడో యాత్ర సాగించానని తెలిపారు. దేశ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని వైఎస్ఆర్ చెప్పారన్నారు. వైఎస్ఆర్ సామాజిక న్యాయం కోసం రాజకీయం చేశాడని తెలిపారు. ఇప్పుడు ఎపీలో సామాజిక న్యాయం లేదన్నారు. వైఎస్ఆర్ ఢిల్లీలో ఎపి హక్కుల కోసం పోరాటం చేసేవారని తెలిపారు. జగన్ మాత్రం బిజెపికి మద్దతు ఇస్తున్నాడన్నారు. బిజెపిని ఒక్క మాట అనలేరని, వారి అవినీతి బయట పడుతుందనే భయమని విమర్శించారు. ఎపి ఆత్మగౌరవం బిజెపి ముందు తలదించుకుందని ఎద్దేవా చేశారు. ఇదే భయం చంద్రబాబుకూ ఉందన్నారు. మేము కోట్లాది మందిని లక్షలాధికారులను చేస్తుంటే మోడీ సోమరిపోతులను తయారు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ఆర్ బిడ్డ షర్మిల ఇవ్వాళ మీముందు నిలబడిందని చెప్పారు. తనచెల్లెలి తరుపున వాగ్దానం చేయాలని మిమ్మల్ని అడుగుతున్నానని విజ్ఞప్తి చేశారు. తనచెల్లి పార్లమెంట్‌లో ఉంటే ఎపి 2లో

ష్..గప్‌చుప్

ఎన్నికల తుదిఘట్టానికి తెరలేచింది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేసి పోలింగ్ ఏర్పాట్లు చేసుకునే వెసులుబాటును అభ్యర్థులకు కల్పించడం ఒకవైపు, మరొక వైపు ఓటర్లపై రాజకీయ నాయకుల ప్రలోభాలను నిరోధించడంలో భాగంగా మద్యం దుకాణాలను మూసేసి, స్వేచ్ఛగా ప్రజలందరూ ఓటుహక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలూ తీసుకుంటోంది. ఈ నెల 13వ తేదీ సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తెరవెనుక మంత్రాంగం నెరపడంలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల్లో తమ తమ ఏజెంట్లు నియామకం, పోలింగ్ అవసరాలకు అనుగుణమైన ఏర్పాట్లు చేసుకోవడంలో నేతలు నిమగ్నమయ్యారు. బూత్ కన్వీనర్లతో నేతలు సమావేశమై ఓట్ల కొనుగోలుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడంతోపాటు, నగదు, చీరలు, మద్యం, ఇతర వస్తువుల సరఫరా చేయడంపై దృష్టి సారిస్తున్నారు. పటిష్టమైన ఎన్నికల తనిఖీలను, నిఘాను సైతం కన్నుగప్పి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంపై దృష్టి పెట్టారు. 4,5లో

కాంగ్రెస్‌తోనే..

(మొదటిపేజీ తరువాయి) హక్కులు ప్రతిధ్వనిస్తాయని చెప్పారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ తల్లి, చెల్లెళ్ళి బాధిస్తూ ఓ నిశ్శబ్దంని వెంటేసుకుని తిరగడందా రుణమన్నారు. గొడ్డలి రాజకీయాన్ని ప్రజలు ఓడించాలని విజ్ఞప్తి చేశారు. దేనికీ పనికిరాని ల్యాండ్‌టైట్లింగ్ యాక్ట్‌ను ఎందుకు తెచ్చారో తెలియడం లేదని యాక్ట్‌లోని నిబంధనల్ని చదివి వినిపించారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల మాట్లాడుతూ విభజన హామీల్ని నెరవేర్చని బిజెపికి తొత్తులుగా మారడంలోని ఔచిత్యమేమిటో తెలియడం లేదన్నారు. జగన్ సంక్రాంతికి జాబ్ కేలండర్ అన్నాడని ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో హత్యారాజకీయాలు తప్పా మరొకటి లేదన్నారు. వైఎస్ వివేకా కేసులో నిందితుడిని పక్కన బెట్టుకుని తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్ జగన్ మారిపోయాడని తెలిపారు. వైఎస్ఆర్ మరణం వెనక రిలయన్స్ హస్తం ఉందని చెప్పాడని, ముఖ్యమంత్రి అయ్యాక వాళ్లకే పిలిచి ఎంపీ పదవులు ఇచ్చాడని విమర్శించారు. వైఎస్ఆర్ పేరును సిబిఐ ఛార్జీషీట్‌లో చేర్పించాడన్నారు. కడప పార్లమెంట్ ఎన్నిక వైపు ప్రపంచం మొత్తం చూస్తోందన్నారు. కడపలో న్యాయాన్ని గెలిపిస్తారా? నేరాన్ని గెలిపిస్తారా అని ప్రశ్నించారు. వైఎస్ఆర్ పాలన తిరిగి తెస్తాన్నారు. కడప ఎన్నిక న్యాయానికి నేరానికి జరుగుతున్న పోరాటమని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటోందన్నారు. సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కి, మత సామరస్యాన్ని మంట గలుపుతుందని హెచ్చరించారు. దేశ సమగ్రత, సమైక్యతలను దెబ్బ తీస్తుందని చెప్పారు. ఇటువంటి బిజెపిని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇండియావేదిక అధికారంలోకి వస్తే కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, కమలాపురం ఇండియావేదిక అభ్యర్థి గాలి చంద్ర మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, పోలవరం, ఉక్కు పరిశ్రమ వంటి హామీలు అమలు కాలేదన్నారు. కడప కాంగ్రెస్ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ దేశానికి అవసరం ఏర్పడిందని తెలిపారు. అన్ని తరగతులకు న్యాయం దక్కాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. రాయచోటి కాంగ్రెస్ అభ్యర్థి అల్లా బకాష్ మాట్లాడుతూ దేశంలో 40 లక్షల మంది మహిళల ఆచూకీ కనిపించడం లేదన్నారు. మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగిస్తే ఖండించని పాపాన పోలేదని బిజెపినుద్దేశించి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఎఐసిసి నాయకులు కెసి వేణుగోపాల్, కర్నాటక డిప్యూటీ సిఎం డి.కె.శివకుమార్, మాణిక్యం ఠాగూర్, కెవిపి రామచంద్రరావు, పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్, మాజీ మంత్రి అహ్మదుల్లా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ ఓబులేసు, కడప, అన్నమయ్య జిల్లాకు చెందిన పార్లమెంట్ అభ్యర్థులు, అసెంబ్లీ అభ్యర్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన రాహుల్

ప్రజాశక్తి - వేంపల్లె

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఘాట్‌లో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఘనంగా నివాళి లర్పించారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ప్రత్యేక విమానంలో కడప ఎయిర్‌పోర్ట్‌కు కాంగ్రెస్ పార్టీ కడప పార్లమెంట్ అభ్యర్థి, పిసిసి ఛీఫ్ షర్మిలతో కలిసి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ విచ్చేశారు. అనంతరం కడప ఎయిర్ పోర్ట్ నుండి హెలికాప్టర్‌లో రాహుల్ గాంధీ, షర్మిల ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సలహాదారుడు కెవిపి రామచంద్రరావు, షర్మిల భర్త బ్రదర్ అనిల్ కుమార్ రాహుల్ గాంధీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం హెలిప్యాడ్ నుండి ప్రత్యేక క్యాన్వాస్ ద్వారా వైఎస్ఆర్ సమాధి వద్దకు రాహుల్ గాంధీ చేరుకున్నారు. వైఎస్ఆర్ సమాధి వద్ద దాదాపు అరగంట పాటు ప్రార్థనలు చేశారు. వైఎస్ఆర్ సమాధి వద్ద వైఎస్ఆర్ గురించి షర్మిల, రాహుల్‌గాంధీ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి రాహుల్ గాంధీ పూల మాలలతో నివాళులర్పించారు.



ప్రజలకు అభివాదం తెల్పుతున్న రాహుల్‌గాంధీ, షర్మిల

ఎన్నికల సిబ్బందికి రవాణా సదుపాయం

- వైఎస్ఆర్ జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియకు హాజరయ్యే ఎన్నికల పోలింగ్ సిబ్బందికి వారికే కేటాయించిన నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్సు రవాణా కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిబ్బందికి కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లడానికి ఈనెల 12న ఉదయం 06.30 గంటలకు, ఎన్నికలు ముగిసిన తరువాత సిబ్బంది తిరుగు ప్రయాణానికి వెళ్లడానికి 13న రాత్రి 09.00 గంటల నుంచి అన్ని నియోజకవర్గ కేంద్రాల నుంచి బస్సులుంటాయన్నారు. ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా 255 ఆర్‌టిసి బస్సులను, 13 ఆర్‌టిసి డిజిటలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

బయటి నుండి వచ్చే స్థానిక ఓటర్లకు ఇబ్బందులు కల్గించొద్దు

ఓటింగ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే స్థానిక ఓటర్లకు చెక్ పోస్టుల వద్ద ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ఓటరు గుర్తింపు కార్డును చూసి జిల్లాలోకి సుమతించాలని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13న జరిగే ఓటింగ్ ప్రక్రియ కోసం 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ అన్నారు. 144 సెక్షన్ అమలులోకి రానుండడంతో జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా 48 గంటల పాటు ఆంక్షలను కఠినతరం చేస్తామని తెలిపారు. ఈ రెండు రోజుల్లో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చే స్థానిక ఓటర్లకు జిల్లా, నియోజక వర్గాల చెక్ పోస్టుల వద్ద, అలాగే అనుమానిత వాహనాలు, వ్యక్తుల తనిఖీల్లో స్థానికంగా ఓటు వేయడానికి వచ్చే జిల్లా ఓటర్లు ఆయా స్థానిక నియోజక వర్గాల్లో నమోదైన ఓటరు గుర్తింపు కార్డును చూపించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ప్రాంతాలకు చేరుకుని తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఈ విషయంలో చెక్ పోస్టుల వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ఓటర్లను ఇబ్బందులకు గురి చేయకుండా సహకరించాలని తెలియజేశారు. తనిఖీల వద్ద ఏదైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ : 08562- 315672 కు కాల్ చేసి తెలియచేయాలని కలెక్టర్ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

ప్రజాశక్తి- కడప అర్బన్

రోగులకు ఆరోగ్య పరిస్థితిని బట్టి వారిని వెంటనే ఐసియుకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు, సిబ్బందికి కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. శనివారం రిమ్స్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ఎంఐసియును వైద్య సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. సాధారణ జ్వరం, రక్త పరీక్షలు వంటి వాటి కోసం నగరంలో ఉన్న బి13 యుపిహెచ్‌సి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించు కోవాలని తెలిపారు. ఎమర్జెన్సీ కేసులను వెంటనే ఐసియుకి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు వచ్చిన అల్ట్రాసౌండ్ మిషనరీని ఎమర్జెన్సీ వార్డులో ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అక్కడ సిబ్బందికి సూచించారు. ఎంఐసియులో ఉన్నటువంటి రోగుల ఆరోగ్యం మామూలు స్థితికి రాగానే వారిని వెంటనే వార్డుకు షిఫ్ట్ చేయాలని పేర్కొన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని అక్కడ సిబ్బందికి సూచించారు. వైద్యం కోసం వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఆలస్యత్వం చేయకుండా తగిన సమయంలో వారికి వైద్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు.



పేషంటుతో మాట్లాడుతున్న కమిషనర్

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప అర్బన్

యువత బాధ్యత కలిగి జీవించాలని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ యేసు వరప్రసాద్, రిటైర్డ్ హెడ్మాస్టర్ పాపిరెడ్డి అన్నారు. నగర శివారు ప్రాంతంలోని రామాంజనేయపురంలో ఉన్న పాస్టరల్ సెంటర్‌లో రెండు రోజులుగా కడప మేత్రాసన కతోలిక యువతి యువకులకు వివాహ తర్ఫీదు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతి, యువకులు తమ భాగస్వామిని ఎంచుకోవడంలో మంచి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. మంచి కుటుంబ నిర్మాణం కోసం యువత కృషి చేయాలని చెప్పారు. తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి జీవించాలన్నారు. భార్యాభర్తలు ఆత్మీయ జీవన విధానం కలిగి ఉండాలని బోధించారు. అనంతరం అన్నమయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యం, మాసాపేట విచారణ గురువు, దేవ సహాయం, సెయింట్ జోసెఫ్ జూనియర్ కాలేజీ మరియాపురం ప్రిన్సిపల్ లక్కినేని మరియదాస్ మాట్లాడుతూ క్రైస్తవ యువత ఇతరులకు ఆదర్శంగా జీవించాలని, తల్లిదండ్రులు సన్మార్గంలో నడుస్తూ పిల్లలను మంచి మార్గంలో నడిపించాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన యువతి, యువకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫాదర్ లారెన్స్, ప్రభాకర్, విలియమ్స్, కస్తురాజు, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ పాల్గొన్నారు.

భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్



ప్రతులు దగ్ధం చేస్తున్న అమీర్ బాబు, నాయకులు

భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్‌బాబు పేర్కొన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్.అమీర్ బాబు కార్యాలయం ఎదుట పట్టాదారు పాసుపుస్తకాలను, 512 జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం - 2022లోని పలు ప్రతిపాదనలు రాష్ట్ర రైతాంగం మొత్తం తీవ్ర భయాందోళనలకు లోనైం దని చెప్పారు. వీటికి సంబంధించి రోజు రోజుకూ వెలుగులోకి వస్తున్న సమాచారంతో తాత ముత్తాతలు, తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమించిన, స్వార్జితమైన భూములు, భవనాలు, ఇతర ఆస్తులపై ప్రస్తుత యాజమాన్య హక్కులు అతి సులువుగా అన్యాక్రాంతం కాను న్నాయని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వం రాజముద్ర వేసి పాస్ పుస్తకాలు అందిస్తామని చంద్రబాబు తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ము స్తాక్, రహ్మతుల్లా, అలీ, మాసా కోదండ రామ్ శివశంకర్ రెడ్డి, నాసర్ అలీ, జయ కుమార్, మాసాపేట శివ, సుబ్బ రాయుడు, నూర్, ఫిరోజ్, అనిల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

టిడిపితోనే దళితులకు సామాజిక న్యాయం

- జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు

ప్రజాశక్తి-కడప అర్బన్

దళితులు ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పనలో టిడిపి తప్ప మరో కటిలేదని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు పేర్కొన్నారు. శనివారం కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో దళిత ప్రజలను ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ అవకాశాలులేకుండా నిర్వీర్యం చేసి తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. మాధవి గెలుపు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధికి మార్గదర్శక మౌతుందని చెప్పారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే, ప్రజాస్వామ్య పాలన కావాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుకు ప్రజలు అధికారం ఇవ్వాలని కోరారు.

మద్యం దుకాణాలు బంద్

- ఆన్‌లైన్ పేమెంట్‌తో ఇబ్బందులు పడుతున్న మద్యం ప్రియులు

ప్రజాశక్తి-చెన్నూరు

ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంటు అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టకొని ముందస్తుగా శనివారం సాయంత్రం నుంచి చెన్నూరులో ఉన్న మూడు మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. మద్యం కోసం షాపులు వద్ద మద్యం ప్రియులు క్యూ కట్టారు. మూడు రోజుల నుంచి మద్యం కోసం ఆన్‌లైన్ పేమెంట్ చేయడంతో ఫోన్ పే, గూగుల్ పే ఉన్నవారు మాత్రమే మద్యం షాపుల వద్ద మద్యం కొనుగోలు చేస్తున్నారు. ఇతరుల వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. షాపుల్లో ఖరీదైన మద్యానే దొరుకుతుండడంతో చాలామంది వెనుతిరిగారు. దుకాణాల నుంచి ముందుగానే కొంతమంది మద్యాన్ని కొనుగోలు చేసుకున్నారు. ఆది, సోమవారం రెండు రోజులు ఎన్నికల దృష్టిలో పెట్టుకొని షాపుల్లో మద్యం విక్రయించకుండా ఎక్సైజ్ అధికారులు షాపులను సీజ్ చేశారు.



మద్యం దుకాణం ముందు క్యూకట్టిన మద్యం ప్రియులు

చివరి రోజు హోరాహోరీగా ప్రచారాలు

టిడిపితోనే యువత భవిష్యత్తు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర అభివృద్ధికి, నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం టిడిపిని గెలిపించాలని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో మండల వ్యాప్తంగా అన్ని పంచాయితీలలోనూ పార్టీ నాయకులు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాచవేటివారిపల్లె పంచాయతీలోని వడ్డేపల్లి, బొంతవారి పల్లె, గొల్లపల్లెలో ఆర్.జె వెంకటేష్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఇవిఎంల నమూనాలను ప్రజలకు చూపిస్తూ ఓటు ఎలా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పించారు. చంద్రబాబుని మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో గత 15 సంవత్సరాలుగా టిడిపి అధికారంలో లేకపోవడంతో అభివృద్ధి కుంటుబడిపోయిందని అన్నారు. టిడిఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న షాజహాన్‌బాషాను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. వైసిపి ఓటర్లకు తాయిలాలు ఇచ్చినా, బెదిరించినా ఓటర్లు టిడిపి ఉమ్మడి అభ్యర్థుల వైపే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో వీరభద్ర, చెన్నం రాజశేఖర్, లక్ష్మన్న, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్‌రాజు ఆదేశానుసారం రామ్మోహన్ రాజు టిడిపి అభిమానులుతో కలిసి కువైట్‌లోని అందలూస్, ఫర్వానియా పార్క్ ప్రాంతాలలో టిడిపికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్‌డిఎ కూటమి మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల గురించి వివరిస్తూ ఎపిలో ఉంటున్న వారి కుటుంబ సభ్యులతో చరవాణి ద్వారా మాట్లాడి అభ్యర్థులను గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించినట్లు రామ్మోహన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు బోనం రాంప్రసాద్, హరిప్రసాద్‌రాజు, శ్రీకాంత్, ప్రసాద్, మహేష్‌రాజు, రాజేంద్రరెడ్డి, కోడూరు మహేష్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారాలు

నిమ్మనపల్లె : ఎన్నికల ప్రచారాలకు చివరి రోజు అయిన శనివారం నిమ్మనపల్లె మండల వ్యాప్తంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థుల గెలుపుకు పోటా పోటీగా ప్రచారాలను నిర్వహించారు. వైసిపి నాయకులు రాచవేటివారిపల్లె, తవళం, నిమ్మనపల్లె, వెంగంవారిపల్లె, రెడ్డివారిపల్లె, సామకోటవారి పల్లెలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఓటర్లకు ఇవిఎంల నమూనాలను చూపిస్తూ వరుస సంఖ్యలోని అభ్యర్థుల వివరాలను తెలియజేస్తూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ప్రజల సంక్షేమం అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన జగన్మోహన్‌రెడ్డికి మళ్లీ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి వస్తేనే ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని, రాష్ట్రవ్యాప్తంగా మరింత అభివృద్ధి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సదాశివరెడ్డి, మండల సచివాల యాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, రెడ్డమ్మ , నరేంద్రరెడ్డి, శ్రీవాణి నవీన్, మహాదేవరెడ్డి, మాజీ సర్పంచ్ రుకియానా బేగం, నాయకులు నవాజ్, విజయ్ కుమార్ రెడ్డి, చంద్రమోహన్, గంగాధర, రవి, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

మదనపల్లి : మదనపల్లి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి ఎం. షాజహాన్ బాషా ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన గృహం వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. చిత్తూరు బస్టాండ్ నుంచి నెహ్రూబజార్ మీదుగా అప్పారావువీధి, బెంగుళూరు బస్టాండుకు చేరుకోగా అక్కడ టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను గజమాలతో సత్కరించారు. మల్లికార్జున సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్ మీదుగా నీరు గట్టువారిపల్లి వద్దకు చేరుకొని అక్కడ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-కడప

అనారోగ్యంతో మృతి చెందిన సుబ్రహ్మణ్యంరావు(70)అనే అనాథ వృద్ధుడి మృతదేహానికి మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు. నగరంలోని శంకరాపురంకు చెందిన శ్రీనారాయణాద్రి సేవా సంస్థ నిర్వాహకులు, రిమ్స్ అవుట్‌పోస్ట్ పోలీసుల విన్నపం మేరకు అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో రాము, అయ్యవారయ్య, రామరాజు, భాను, సురేష్, గురువయ్య, పుల్లయ్య, సాయి పాల్గొన్నారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి జూన్ 6వ తేదీ వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు, లోక్‌సభకు సార్వత్రిక ఎన్నికలు-2024 నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించడానికి, ఎన్నికల నిర్వహణలో అవాంఛనీయ సంఘటనలను నివారించడం కోసం జిల్లాలో సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలి పారు. ఐదుగురు కంటే అంతకంటే ఎక్కువ మంది గుమికూడడం సెక్షన్ 144 క్రింద నేరంగా పరిగణించబడుతుందని అన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాలు, పరీక్షల నిర్వహణ, ఇతర అత్యవసర పనులలో ఉన్న విద్యాసంస్థలు, నిబంధనలకు లోబడి పని చేస్తున్న పార్కులు, మైదానాలు, వినోద కేంద్రాలు నిర్వహించకూడదన్నారు. ఎంసిసికి లోబడి ఎన్నికల ప్రచారాల కోసం ఎన్నికల సంఘం అనుమతించిన వారు తప్ప ఇతరులు ఎవరు లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం నిషిద్ధమని తెలిపారు. బహిరంగ సభలకు, ఇతర ఎటువంటి ఎన్నికల ప్రచారానికైనా ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. బహిరంగ ప్రదేశాలలో పటాసులను కాల్చడం నిషిద్ధం అన్నారు. పోలీస్ శాఖ వారిచే అనుమతులు పొందిన వారు మినహా ఎవరైనా అన్ని లైసెన్సుడ్ తుపాకీలను దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలి అన్నారు. ఈ నియమ నిబంధనలు శనివారం సాయంకాలం 6 గంటల నుంచి జూన్ 6 వరకు ఉంటాయని జిల్లా తెలిపారు. ఈ నియమ నిబంధనలు ఏ వ్యక్తి అయినా పాటించకపోతే ఐపిసి సెక్షన్ 188 కింద శిక్షార్హులు అవుతారని తెలిపారు.

కూటమికి మద్దతుగా ఎంఆర్‌పిఎస్ ప్రచారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బిజెపి, జనసేన, తెలుగుదేశం కూటమికి మద్దతుగా ఎంఆర్‌పిఎస్ నాయకులు శనివారం పట్టణ పరిధి లోని మన్నూరు, ఎర్రబల్లి, డిబి ఎన్‌పల్లె గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఎన్‌డిఎ కూటమిని బల పరుస్తూ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయ కులు వెలగచర్ల శివయ్య, ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వడ్డెర పెంచలయ్య, ఎంఆర్‌పిఎస్ మాజీ మండలాధ్యక్షులు బాలిపోగు సుబ్బయ్య, ఎంఆర్‌పిఎస్ తమ సొంత ఖర్చులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి కరపత్రాలు అందజేసి కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ కూటమితో కేవలం మాదిగ సామాజిక వర్గానికి మాత్రమే కాక అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరనుందని అన్నారు. టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- రోడ్‌షోలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం నియోజకవర్గంలో పిటిఎం, మొలకలచెరువు, తంబళ్లపల్లి, అంగళ్లు, బి.కొత్తకోట భారీ రోడ్‌షోను నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాదిగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాత్ర అమోఘమైందన్నారు. ఆయన నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మరొకసారి ద్వారకనాథ్‌రెడ్డిని గెలిపించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ నేరెళ్ళ రెడ్డిహరి, కొండ సిద్ధార్థ, వైసిపి టౌన్ కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, మాజీ ఉపసర్పంచ్ మాలిక్, జివి.రామకృష్ణ, సచివాలయ కన్వీనర్లు కంచి కల్యాణ్ కుమార్ రెడ్డి, శెట్టిపల్లి రమేష్ రెడ్డి, జె.ఎన్.పి శ్రీనివాసులు, నక్క సంతోష్, ఎస్ ఎస్ ఫయాజ్ పాల్గొన్నారు.

వైసిపి నుంచి జనసేనలో 150 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట పంచాయతీలోని అరుంధతి వాడకు చెందిన 150 కుటుంబాలు వైసిపిని వీడి మండల జనసేన నాయకులు పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ వన్ కన్వీనర్ జోగినేని మణి, ఆలం రమేష్, బాలాజీ ఆధ్వర్యంలో వారికి జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసిపి చేస్తున్న అరాచకాలు తట్టుకోలేక జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతోనే పవన్‌కల్యాణ్ రాజకీయాలకు వచ్చారని అన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెరియవరం సుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, చిన్న, వెంకటయ్య, ప్రసాద్, రాయచోటి శివయ్య, భరత్, హనుమాన్, కృష్ణ, మళ్లీ, పెంచలయ్య, గురవయ్య, సుబ్బరామయ్య, రామాంజనేయులు, రమణయ్య పాల్గొన్నారు.

తెలుసుకుందాం

వీవీ ప్యాట్ల గురించి..

- 2017లో ప్రారంభమై ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఉపయోగించారు.
- 4 పోలింగ్ కేంద్రాల్లో రీకౌంటింగ్‌కు అనుమతి ఇచ్చారు.
- నాలుగింటిలోనూ రీ కౌంటింగ్ లెక్క కచ్చితంగా సరిపోయింది.
- 2017 తరువాత గోవా, గుజరాత్, హిమచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, కర్ణాటక రాష్ట్రాల్లో వందశాతం వీవీ ప్యాట్లను ఉపయోగించారు.
- ఇక్కడ ఒక చోట మాత్రమే రీకౌంటింగ్‌కు అభ్యర్థన రాగా రీకౌంటింగ్ చేశారు. రీ కౌంటింగ్ కచ్చితంగా సరిపోగా తప్పుడు ఫిర్యాదు చేసిన ఫిర్యాదుదారుకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.
- 2017 నవంబరు తరువాత అన్ని ఎన్నికల్లోనూ వీవీప్యాట్లను ఉపయోగిస్తున్నారు. ర్యాండ్‌గా ఎంపిక చేసిన కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వీవీప్యాట్లలోని స్లిప్పలను ప్రయోగాత్మకంగా లెక్కించారు.
- ఇప్పటి వరకు 839 పోలింగ్ కేంద్రాల్లో వీవీ ప్యాట్లలోని స్లిప్పలను లెక్కించగా వందశాతం కచ్చితంగా సరిపోయింది.
- దేశంలో ప్రస్తుతం 40 లక్షల యూనిట్లు ఉత్పత్తిలో ఉన్నాయి. వీటి విలువ రూ.5,626 కోట్లు.

వీవీ ప్యాట్‌లో ఓటు తప్ప పడితే..



ఎన్నికల్లో తొలిసారి వీవీ ప్యాట్లను (ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయేల్) వినియోగిస్తున్నారు. ఈవీఎంలలో ఓటరు తాను వేసిన గుర్తుకే ఓటు పడిందా? లేదా? అనే అనుమానం వచ్చినప్పడు వీవీ ప్యాట్ ద్వారా పరిశీలించుకోవచ్చు. తాను వేసిన గుర్తు ఒక్కటైతే వీవీప్యాట్‌లో మరో గుర్తుకు పడినట్లు తప్ప ప్రింట్ చూపిస్తే దానిని రాంగ్ ప్రింట్ ఆఫ్ వీవీ ప్యాట్ పేపర్‌స్లిప్ అంటారు. అలాంటి సందర్భంలో పీవోలు ఏం చేయాలని అనే దానిపై ఓటరు అవగాహన కల్గి ఉండాలి.

- ప్రిసైడింగ్ అధికారి నిబంధన 49 ఎంఎ ప్రకారం చర్యలు తీసుకోవాలి
- హ్యాండ్ బుక్‌లోని అనెక్సర్-15 ప్రకారం ఫిర్యాదు చేసిన ఓటరు వద్ద డిక్లరేషన్‌ను ప్రిసైడింగ్ అధికారి తీసుకోవాలి
- పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో 17 ఎలో ఓటరు వివరాలు మరో సారి ఎంటర్ చేయాలి
- కంట్రోల్ యూనిట్ నుంచి ఓటును విడుదల చేయాలి. ఏజెంట్ల సమక్షంలో ప్రిసైడింగ్ అధికారి వీవీ ప్యాట్‌లో వచ్చిన స్లిప్‌లను పరిశీలించాలి.
- ఓటరు ఫిర్యాదు నిజమని తెలితే ప్రిసైడింగ్ అధికారి పోలింగ్‌ను ఆపేసి రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలి
- ఓటరు ఫిర్యాదు తప్పని తెలితే 17-ఎలో ఆ ఓటరు రెండోసారి రాసిన వివరాలు రిమార్క్ కాలమ్‌లో ఓటరు చేసిన ఫిర్యాదు తప్పని రాయాలి.
- 17-సి అనగా పోలైన ఓట్ల వివరాలు తెలిపే ఫారంలోని మొదటి భాగంలో (పార్ట్-1) ఆ వివరాలు నమోదు చేయాలి.
- పోలింగ్ సమయంలో ఈవీఎంలు, వీవీప్యాట్లు పనిచేయకపోతే వాటి స్థానంలో రిజర్వులోని వాటి ఏర్పాటు చేయాలి.
- కొత్త ఈవీఎం, వీవీ ప్యాట్‌లో మళ్లీ మాక్‌పోల్ నిర్వహించాలి. డిక్లరేషన్ రాయలి. (సింగిల్‌ఓటు)
- ప్రిసైడింగ్ అధికారి వద్ద ఓటరు జాబితాకు సంబంధించి వర్కింగ్ కాపీలు, మార్క్‌డ్ కాపీలు ఉంటాయి. అందులో అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ (ఏస్‌డీ) జాబితాలో ఉన్న ఓటర్లను మార్క్ చేసి ఉంటారు.

మీకు తెలుసా



దేశంలో తెల్లదొరల కాలం నుంచి ఓటు హక్కులను వినియోగించుకుంటున్నారు. నేడు 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు ఉండగా గతంలో కొన్ని వర్గాలకే ఉండేది. ఉద్యోగులు, అక్షరాస్యులు, బాగా పంట భూములున్న వారికే ఓటు హక్కు ఉండేది. అప్పట్లో మండలాలను ఫిర్కాలుగా పిలిచే వారు. గ్రామస్థాయిలో ఇప్పటి విఆర్‌ఒకు బదులుగా విఎం (విలేజ్ మేజిస్ట్రేట్) ఉండేవారు. వీరి వద్దనే ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే వారు. ప్రత్యక్ష పద్ధతిలో బహిరంగ సభలో మెజార్టీ కోసం చేతులెత్తి ఓటును వినియోగించుకునే వారు. 1952, 1957 ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి ఒక్కో బాక్సు ఏర్పాటు చేసి అందులోనే ఓటు వేసే పద్ధతిలో ఓటు నిర్వహణ ఉండేది. తర్వాత అభ్యర్థులందరికీ ఒకే బాక్సులో ఓటు వేసే విధానం వచ్చింది. పోలింగ్ 70 శాతానికి మించితే రిగ్గింగ్ జరిగిందని అధికారులు నిర్ధారణకు వచ్చేవారు. కాలక్రమంలో రహస్య పోలింగ్ విధానం అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం బ్యాలెట్ పత్రాలతో ఓటు వేసే విధానం నుంచి ఇవిఎంలు, వివిప్యాట్ యంత్రాలను వినియోగించే స్థాయికి చేరుకున్నారు.




సార్వత్రిక సమరం



ష..గప్‌చుప్

ముగిసిన ప్రచార పర్వం
ఊరించనున్న డబ్బు, మద్యం
ప్రాబల్యమున్న నేతలకు నజరానాలు
వ్యూహ ప్రతివ్యూహాల్లో నాయకులు
తెరవెనుక మంత్రాంగంలో అభ్యర్థులు
క్రియాశీల కార్యకర్తలతో సమాలోచనలు
ఓటింగ్ పోలరైజేషన్‌పై నేతల దృష్టి

ఎన్నికల తుదిఘట్టానికి తెరలేచింది. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేసి పోలింగ్ ఏర్పాట్లు చేసుకునే వెసులుబాటును అభ్యర్థులకు కల్పించడం ఒకవైపు, మరొక వైపు ఓటర్లపై రాజకీయ నాయకుల ప్రలోభాలను నిరోధించడంలో భాగంగా మద్యం దుకాణాలను మూసేసి, స్వేచ్ఛగా ప్రజలందరూ ఓటుహక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలూ తీసుకుంటోంది. ఈ నెల 13వ తేదీ సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తెరవెనుక మంత్రాంగం నెరపడంలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల్లో తమ తమ ఏజెంట్లు నియామకం, పోలింగ్ అవసరాలకు అనుగుణమైన ఏర్పాట్లు చేసుకోవడంలో నేతలు నిమగ్నమయ్యారు. బూత్ కన్వీనర్లతో నేతలు సమావేశమై ఓట్ల కొనుగోలుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడంతోపాటు, నగదు, చీరలు, మద్యం, ఇతర వస్తువుల సరఫరా చేయడంపై దృష్టి సారిస్తున్నారు. పటిష్టమైన ఎన్నికల తనిఖీలను, నిఘాను సైతం కన్నుగప్పి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంపై దృష్టి పెట్టారు.



నెల రోజులుగా ఊరూ వాడా ఎన్నికల ప్రచారంలో హోరెత్తిన మైకులు మూగనోము పడ్డాయి. శనివారంతో సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. ఆయా రాజకీయ పార్టీల నేతల గొప్పదనాన్ని పొగుడుతూ రాసిన పాటలతో నిన్నటి వరకు హోరెత్తిన ప్రచార రథాలు ఒక్కసారిగా మూగబోయాయి. పల్లెపల్లెకు వెళ్లి సందు గొందు తిరుగుతూ చేపట్టిన ప్రచారాలు, ప్రధాన కూడళ్లలో ముఖ్యనేతల ప్రసంగాలు, రోడ్‌షోలకు తెరపడింది. ఈ రోజు గడిస్తే ఓటు హకును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద జనం బారులు తీరనున్నారు. ఇప్పటికే జనాన్ని ప్రలోభపెడుతూ ఆయా రాజకీయ పార్టీలు డబ్బు మూటలు విప్పి విచ్చలవిగా పంపిణీ చేస్తున్నాయి. రకరకాల సాదనాల్లో డబ్బు మూటలను గ్రామాలకు తరలిస్తున్నారు. పోలీసులు, ఇతర అధికారులు చేసిన తనికీల్లో ఇప్పటికే సుమారు కోట్లాది రూపాయలకు పైగా డబ్బు పట్టుపడింది. ప్రచారాలకు తెరపడటంతో డబ్బు పంపిణీపై ముఖ్య నాయకులు దృష్టి పెట్టారు. రాబోయే 48 గంటల్లో ఎలాగైనా ఓటును కొనాలనే ఆలోచనలో ఉన్నారు. ఆయా రాజకీయ పార్టీలు డబ్బు, మద్యాన్ని జోరుగా పంపిణీ చేస్తున్నాయి. జిల్లాలోని పది శాసనసభ, రెండు లోక్‌సభ స్థానాలకు ఈ నెల ఏడవ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

వ్యూహ ప్రతివ్యూహాల్లో నాయకులు

ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే పట్టుదలతో రాజకీయ పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ప్రధాన తెలుగుదేశం, వైసిపి పార్టీల మధ్యే తీవ్రంగా పోటీ నెలకొంది. రెండు పార్టీల అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుగా పోటీ ఉంది. ఆయా పార్టీల అభ్యర్థులతో పాటు కాంగ్రెస్, ఇతర పార్టీల అభ్యర్థులు వ్యూహాలు అమలు చేస్తున్నాయి. అన్ని పార్టీల్లోనూ ఇలాంటి తతంగమే సాగుతోంది. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాల్లో ముంచేస్తున్నారు. పోలింగ్‌కు రెండు రోజులే గడువు ఉండటంతో సాధ్యమైనంత మేరకు ఓట్లు దండుకునేందుకు నగదు పంపిణీకి అవసరమైన సన్నాహాలు ప్రారంభించారు. ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపుకు అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. అందుకే ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ కొద్దిపాటి ప్రాబల్యమున్న వ్యక్తులను కూడా కలసి వారి డిమాండ్లను తెలుసుకునే పనిలో కొందరు కీలక నాయకులు తలమునకలయ్యారు. ఇప్పటికే ఓటర్లను, సామాజిక వర్గాలను ప్రబావితం చేస్తున్నారు. ప్రాంతాల వారీగా పెద్దమనుషులుగా చెలామని అయ్యే వారికి గిరాకీ పెరిగిపోయింది.

జోరుగా పంపకాలు


జిల్లాలోని అన్ని చోట్లా ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు నోట్లతో ఎరచూపుతున్నారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులు తమ అనుచరులతో ఇంటింటి ప్రచారం చేయిస్తూ పోలింగ్ స్లిప్పులతో పాటు నోట్లు కూడా పంచుతున్నట్లు తెలిసింది. పోలీసు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ యథేశ్ఛగా పంపిణీ కానిస్తున్నారని తెలిసింది. ఏ మాత్రం బయపడకుండా పెద్ద ఎత్తున సొమ్మును పంచడంలో అభ్యర్థులు పోటీలు పడుతున్నారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు, మూడు వేల వరకు పంచుతున్నారు. పోలింగ్ ముందు రోజు అయితే ఎక్కువగా పోలీసులు మోహరించి ఉంటారనే కారణంగా ముందుగానే ఓటర్లను అభ్యర్థులు ప్రసన్నం చేసుకుంటున్నారు.

- ప్రజాశక్తి-కడప డెస్క్

ఎన్నికల సిరాకు ఓ చరిత్ర



ఓటు వేసే ముందు ప్రతి ఓటరుకూ ఎడమ చేతి చూపుడు వేలు గోరుతో పాటు చర్మంపైకి వచ్చేలా ఎన్నికల అధికారులు చిన్న గీత మాదిరిగా పెడతారు. ఈ సిరా పక్షం రోజుల వరకు చెరిగిపోదు. ఒకసారి ఓటు వేసిన వ్యక్తి మరోసారి ఓటు వేయకుండా ఉండేందుకు ఇలా చేస్తారు. ఎన్నికల రోజు ఓటు వేయగానే తమ వేలిపై ఉన్న సిరా చుక్కను చూపుతూ సెల్ఫీ దిగడం, దానిని సామాజిక మాధ్యమాల్లో అప్లోడ్ చేయడం యువతకు ఫ్యాషన్‌గా మారింది. 'నేను ఓటు వేశాను మీరు కూడా ఓటు వేయండి' అంటూ క్యాప్షన్‌లు కూడా పెడతారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిగినా ఇవిఎంలతో ఎన్నికలు జరిగిన సిరా మాత్రం తప్పనిసరి. ఎన్నికల సామగ్రిలో కీలకమైన సిరాకు కూడా ఒక చరిత్ర ఉంది. అదేంటో తెలుసుకుందాం.




మైసూరు నుంచి సరఫరా

ఎన్నికల్లో ఉపయోగించే ఇంకు వెనుక పెద్ద కథే ఉంది. దీనిని కర్నాటక రాష్ట్రంలోని మైసూర్ జిల్లాలో ఉన్న మై లాక్ (మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్)అనే పరిశ్రమలో తయారు చేస్తారు. 1962 నుంచి ఇంతవరకు ఎన్నికల్లో వినియోగిస్తున్నారు. 1937లో మైసూర్ రాజు వంశస్థుడైన నాల్ వాడి కష్ణంరాజు వడయార్ రంగుల రసాయనాల కోసం ఈ మై లాక్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సంస్థ కాబట్టి అక్కడ తయారైన ఇంకునే దేశవ్యాప్తంగా ఎప్పుడూ ఎన్నికలు జరిగినా వాడుతారు.

పక్షం రోజుల వరకు సిరా ఆనవాళ్లు

ఎన్నికల్లో ఓటు వేసేటప్పుడు వేలిపై రాసే సిరా దాదాపు పక్షం రోజుల పాటు ఉంటుంది. అంత నాణ్యతతో ఉంటుంది కాబట్టే కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల్లో వినియోగానికి అవసరమైన ఇంకు కోసం మై లాక్ సంస్థనే ఆశ్రయిస్తుంది. ఓట్లు వేసే కోట్లాది మంది ఓటర్లు చూపుడు వేలిపై చుక్క పెట్టేందుకు ఎన్నికల నిర్వహణకు చాలా ముందే మై లాక్ సంస్థకు ఆర్డర్ ఇస్తారు. మనదేశంతో పాటు ఇతర దేశాలకు మైసూర్ ఇంకు సరఫరా అవుతుంది.

ఓటు అంటే సమ్మతి



2013లో నోటా వినియోగం
మనం వేసిన ఓటు పరిశీలించుకోవచ్చు

ఎన్నికలు వచ్చా యంటే ఎక్కడ ఇద్దరు కలిసినా ఓటు గురించి చర్చలే. అంతగా ప్రజలను ఆకట్టుకుంటున్న ఓటు గురించి తెలుసు కుందాం. ఓటు అంటే సమ్మతి (అంగీకారం) అని అర్థం. ఎన్నికల గుర్తింపు కార్డును తొలిసారిగా హర్యానాలో విని యోగించారు. నోటా మీటాను 2013 ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా ప్రవేశపెట్టారు. ఇవిఎంను (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) తొలిసారి కేరళలోని పరూర్ నియోజకవర్గంలో ఉపయోగించారు. దేశంలో తొలిసారిగా 2014 సాధారణ ఎన్నికల్లో ఇవిఎంలను వినియోగించారు. 1990లో ఎంబిహనీఫా అనే వ్యక్తి భారత తొలి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని తయారు చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే దీనికి గులాబిరంగు సీలు వేస్తారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1996లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 1,033 మంది అభ్యర్థులు మొదకురిచి నియోజకవర్గంలో పోటీ చేశారు.

ఐదురకాలుగా సాధారణ ఓటు: దేశంలో సాధారణ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వీరు స్థానికంగా నివాసం ఉంటూ వారి పరిధిలో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లి గుర్తింపు కార్డులను చూపి వారి ఓటు హక్కును వినియోగించుకుంటారు.

తపాలా బ్యాలెట్ : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు తపాలా బ్యాలెట్ ద్వారా వారి ఓటును వినియోగించుకుంటారు. ఎన్నికల విధులు తమకు కేటాయించారని ధృవపత్రం చూపించి ఓటు వేస్తారు. విధులకు వెళ్ళే ముందు ఓటును బాక్స్‌లో వేస్తారు. ఎన్నికల ఫలితాల సమయంలో ప్రథమంగా ఈ ఓట్లను లెక్కిస్తారు.

టెండరు ఓటు : పోలింగ్ కేంద్రా నికి ఓటరు వెళ్ళేసరికి అతను/ఆమె ఓటును ఎవరైనా వేస్తే అసలైన ఓటరు తన ఓటును విని యోగించుకునే పద్ధతిని టెండరు ఓటు అంటారు. అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఉన్న ప్పుడు టెండరు ఓట్లు లెక్కిస్తారు.

సర్వీసు ఓటు : దేశ రిహద్దులో సైనిక పారా మిలటరీ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉండే ఉద్యోగులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని ఎన్నికల అధికారికి చిరునామా సమర్పించాలి. దీంతో ఎన్నికల అధికారులు తపాలా ద్వారా బ్యాలెట్ పత్రాన్ని సదరు ఉద్యోగికి పంపిస్తారు. నిర్ణీత సమయంలోగా పోస్టు ద్వారా ఓటు పంపాల్సి ఉంటుంది. ఈ ఓట్లను సర్వీసు ఓట్లు అంటారు.

ప్రాక్సీ ఓట్లు : కేంద్ర నిఘా సంస్థలు, గూఢాచారి సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు తాము ఎక్కడ ఉన్నామన్న విషయాన్ని తెలియకుండా ఉండడానికి ప్రాక్సీ ఓట్లు వేస్తారు.

మనం వేసిన ఓటు పరిశీలించుకోవచ్చు : ఎన్నికలకు ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్‌పై తీవ్ర దుష్ప్రచారం జరుగుతోంది. ఒకరికి వేసిన ఓటు మరొకరికి నమోదయ్యేలా చేయవచ్చు అన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఇలాంటి తరుణంలో ఓటర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు ఎన్నికల కమిషన్ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. మనం ఎవరికి ఓటు వేశామో తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. ఇందుకు ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయిల్ (వివిఫ్యాట్) ఏర్పాటు చేసింది. ఈ యంత్రాన్ని ఇవిఎంకు అనుసంధానం చేస్తారు. ఇవిఎంలో ఓటు ఎవరికి వేశారో వివిప్యాట్‌లో తెలిసిపోతుంది. ఓటు వేసిన వ్యక్తికి ఏడు సెకన్ల పాటు వివి ప్యాట్‌లో ఉన్న స్క్రీన్‌పై అభ్యర్థి గుర్తు కనిపిస్తుంది. వివిప్యాట్‌ను మొదటిసారిగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో అందుబాటులోకి తెచ్చారు.



మీడియాతో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

షర్మిల గెలుపు రాష్ట్ర రాజకీయాలకు మలుపు

వైఎస్ఆర్ పెరటిలో మొలచిన గంజాయి మొక్క జగన్
సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

షర్మిల గెలుపు రాష్ట్ర రాజకీయాలకు మలుపు అని, వైఎస్ఆర్ పెరటిలో మొలచిన గంజాయి మొక్క జగన్ అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ పేర్కొన్నారు. శనివారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడారు. కడప పార్లమెంటుకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వైయస్ షర్మిలను, కమలాపురం అసెంబ్లీ సిపిఐ అభ్యర్థి గాలి చంద్రను గెలిపించాలని ప్రజలకు కోరారు. వైఎస్ షర్మిల గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని, రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని చెప్పారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి పేరు చెప్పి అధికారంలోకి వచ్చి ఆయన ఆశయాలకు తిలోదకాలు ఇచ్చారన్నారు. కమలాపురం నియోజకవర్గంలో 1952లో కీ.శే. ఎన్. శివరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేశారన్నారు. ఈ ప్రాంతం నుంచి పోటీ చేస్తున్న గాలి చంద్ర విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమానికి అంకితమై ప్రజా పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. ప్రజా సమస్యల పట్ల, ప్రాంతం పట్ల సమగ్రమైన అవగాహన కలిగిన గాలి చంద్రను గెలిపించడం ద్వారా నియోజకవర్గం అభివృద్ధి, షర్మిల గెలుపుతో జిల్లా సమగ్ర అభివృద్ధికి సులువు అవుతుందన్నారు.

టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని అంబవరంలో టిడిపి నాయకులు ఫైర్ శివారెడ్డి, తిమ్మారెడ్డి, ఎర్రమాచు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైసిపి నాయకులు నల్లమాచూ కృష్ణారెడ్డి, నల్లమాచూ శివారెడ్డి, నల్లమాచూ సతీష్ రెడ్డిలు వారితోపాటు ముగ్గురు వాలంటరీలు నవనిశ్వర్ రెడ్డి, పులి శివశంకర్, నల్లా మునిష్, 30 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వారికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తానరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ టిడిపి గెలుపు తథ్యం, మన రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యం చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో ఏ ఒక్కరికైనా న్యాయం జరిగిందా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని తెలిపారు.

టిడిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని 27వ డివిజన్ గౌస్ నగర్‌లో కూటమి కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి గెలుపు కోసం శనివారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్.అమీర్ బాబు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. చంద్రన్న సంక్షేమ పథకాలను వివరించి, ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు ముస్తాక్, రహ్మతుల్లా, అలీ,టిడిపి పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసా కోదండ రామ్, నగర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది లింగాల శివశంకర్ రెడ్డి, మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్, మాసాపేట శివ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న తెలుగుదేశం నాయకులు



ప్రచారం చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం :'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా శ్రేయస్సే తన లక్ష్యమని రైల్వేకూడరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి తనకు ఒక అవకాశం ఇచ్చి చూడాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి ఏంటో, ప్రజా శ్రేయస్సు అంటే ఏంటో చేసి చూపిస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో, కోడూరు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగకపోగా విధ్వంసం, దోపిడీ, దౌర్జన్యం, భూకబ్జాలు, స్మగ్లింగ్, గంజాయి మాఫియాలతో రాష్ట్రం అధోగతి పాలయిందని అన్నారు. రాష్ట్రానికి రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నామని అన్నారు. అభివృద్ధి ప్రధాత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడం ఎంతో అవసరమని అన్నారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని ఒక గాడిలో పెట్టగల సత్తా ఉన్న నేత చంద్రబాబుకే సాధ్యమని అన్నారు. ప్రజలు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆలోచించి నిర్ణయం తీసుకొని ఓటు వేయాలని లేకుంటే మరో ఐదేళ్లపాటు నరకం తప్పదని అన్నారు. కార్యక్రమంలో జనసేన అభ్యర్థి ఆరవ శ్రీధర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, టిడిపి నాయకులు కల్లా చలపతి, వెంకటేశ్వరరాజు, కట్టా బాలాజీ, సర్పంచ్ సంయుక్త, అనిత దీప్తి, పి రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నడిరోడ్డులో చెత్తకుప్ప

రోడ్డుపై పారుతున్న మురుగునీరు.. పట్టని అధికారులు



నడిరోడ్డుపై పేరుకుపోయిన చెత్త, పారుతున్న నీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు పోయేందుకు కాలువల్లేవు. స్థానిక పదవ కౌన్సిల్ వార్డులో మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై ఏరులై పారుతోంది. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. 2019 ఎన్నికల ముందు వైసిపి నాయకులు సెంటర్ డ్రయినేజీ వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఐదేళ్ల గడిచినా ఆ హామీ మాత్రం నెరవేరలేదని స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. మురుగు అంతా రోడ్లపై పారుతుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి, ప్రజారోగ్యాలు దెబ్బ తింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. మురుగు ఎక్కడి కక్కడ నిలిచి దుర్వాసనను వెదజల్లుతోందని పేర్కొంటున్నారు. వీధిలోని నడిరోడ్డుపై మురుగు ప్రవహిస్తూ చెత్తకుప్పలా నిలుస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీధిలో ప్రజలు నడిచి వెళ్లే పరిస్థితి లేదని చెబుతున్నారు. మురుగునీరు నిత్యం ప్రవహి స్తునడంతో రోడ్డు మొత్తం పాచి పట్టి జారుతోందని, ఆ కారణంగా కొంతమంది కిందపడినా అధికారుల్లో చలనంలేదని అంటున్నారు. సమస్యను అధికారులు, స్థానిక వైసిపి కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించు కోవడంలేదంటున్నారు. ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



వీధిలోని మురుగు నీటి సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. వీధిలోని ప్రజలు మురుగు నీటితో సహాజీవనం చేసే పరిస్థితి. ప్రజలు దుర్వాసన, రోగాలతో అల్లాడుతున్నా నాయకులు, అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహారిస్తున్నారు. 2019 ఎన్నికల ముందు గెలిచిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, మళ్లీ ఎన్నికలు వచ్చినప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

- మాబు, స్థానికుడు, ఎర్రగుంట్ల



బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ అవినాష్‌రెడ్డి

చంద్రబాబు చెప్పే అబద్ధాలను నమ్మొద్దు : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల కోసం చంద్రబాబు ప్రజలకు అబద్దాలు చెబుతున్నారని, వాటిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా వేంపల్లెలోని పులివెందుల రోడ్డు నుండి కడప రోడ్డు మీదుగా కాపు వీధి, మైయిన్ బజార్, అమ్మవారిశాల, గాంధీ రోడ్డు మీదుగా వైఎస్ఆర్ సర్కిల్ వరకు అవినాష్ రెడ్డి, వైసిపి నేత సతీష్ కుమార్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సర్కిల్ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ వేంపల్లిలో పెండింగ్‌లో ఉన్న పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 175 నియోజకవర్గాల్లో నెంబర్‌వన్‌గా పులివెందుల అభివృద్ధి చెందిందని చెప్పారు. సాగునీటి రంగంలో నియోజకవర్గ రైతులకు ఎంతో మేలు చేశామన్నారు. చంద్రబాబు గత ఎన్నికల్లో అసత్యాలు, అబద్దాలు చెప్పారని విమర్శించారు. ఎన్నికలు అయిపోయాక చంద్రబాబు అన్ని హామీలను పక్కన పడేస్తారని పేర్కొన్నారు. చంద్రబాబుకు విశ్వసనీయత లేదని అన్నారు. చంద్రబాబు స్క్రిప్టును కాంగ్రెస్ పార్టీకి చెందిన షర్మిల, సునీత చదువుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో తనపై మా అక్క ద్వేషం పెంచే ప్రయత్నం చేస్తోందన్నారు. సునీతకు నన్ను ఇబ్బంది పెట్టడం కావాలి, చంద్రబాబుకు జగనన్నను ఇబ్బంది పెట్టడం కావాలి అన్నారు. వైసిపికి పడే ఓట్లను చీల్చడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నిజాయితీగల నాయకుడిపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. శాంతికి చిహ్నం అవినాష్‌రెడ్డి అన్నారు. హత్య రాజకీయాలను అవినాష్ రెడ్డి ప్రోత్సహించే ప్రయత్నం ఏనాడూ చేయలేదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, సతీష్‌రెడ్డి తనయులు తుషార్ రెడ్డి, రోహన్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రచారంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో ఎంపిటిసి ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వైసిపి తరపున ఇంటింటి ప్రచారం చేశారు. దాదాపు 50 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి జగన్ ప్రభుత్వాన్ని బలపరచాలని కోరారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలతోపాటు సాఫ్ట్‌వేర్ రంగం కూడా అభివృద్ధి సాధించిందన్నారు. విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల అభివృద్ధి చెందాలంటే జగన్ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో దేవాలయ నిర్మాణానికి రూ.8 లక్షలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పివి రమణారెడ్డి, ఇన్‌చార్జి సర్పంచ్ ఓబులేసు, నాయకులు జయరామిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, జయసింహారెడ్డి, నరసింహారెడ్డి, మణికంఠ, నరసింహారెడ్డి, వీరేంద్రారెడ్డి, అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి ఎన్.వరదరాజులరెడ్డి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఓ దుర్మార్గపు చట్టం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఓ దుర్మార్గమైన చట్టం అని ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ చట్టాన్ని టిడిపి అధికారంలోకి వస్తే రద్దు చేస్తామన్నారు. వేల కోట్ల రూపాయల భూములను కాజేయడానికే ఈ చట్టాన్ని వైసిపి ప్రభుత్వం రూపొందించిందని వివరించారు. రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక నిర్ణయం తీసుకొని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేస్తామన్న వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. ఓటర్లు అన్ని విధాలా ఆలోచించి రాష్ట్రాన్ని ఏ పార్టీ అయితే అభివృద్ధి పథంలో నడిపిస్తుందో ఆ పార్టీకే ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓట్లు వేయాలని కోరారు. అభివృద్ధికి పెద్దపీట వేసి సుపరిపాలన అందిస్తూ శాంతిని కాంక్షించే పార్టీకే ప్రజలు ఓట్లు వేయాలని వరదరాజులరెడ్డి అభ్యర్థించారు. కార్యక్రమంలో బిసి నాయకుడు చల్లా రాజగోపాల్ పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి : బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఇన్నాళ్లు వైయస్ కుటుంబానికి ఛాన్స్ ఇస్తున్న మీరు ఈసారి పులివెందుల ప్రజలు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. శనివారం పులివెందుల టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మీ కుటుంబానికి మంచి జరిగితే తనకు ఓటు వేయండి అని జగన్ అంటున్నారు.. నేను కూడా సూటిగా ప్రశ్నిస్తున్నాను.. మంచి జరగడమంటే కరెంట్ బిల్లు పెరగడమా.. రైతులకు ఇన్సూరెన్స్, డ్రిప్ పరికరాలు పంపిణీ చేయకపోవడం మంచా అని ప్రశ్నించారు. దొంగ ఓట్లు వేస్తే పోలీసులకు పట్టిస్తామన్నారు. ప్రజలను స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్లను వేసుకోనివ్వండి అన్నారు. ప్రతిసారి జగన్ ఇది పేదవాడికి, పెత్తందారికి పోటీ అంటున్నారు.. అదే కరెక్ట్ అయితే పేదవాడిని నేను.. జగన్ 750కోట్లు చూపించుకున్న వ్యక్తి పెత్తందారి. పులివెందుల నియోజకవర్గం ప్రజలను కోరుతున్నా పేదవాడిని అయిన తనకు ఓట్లు వేసి గెలిపించాలని బిటెక్ రవి కోరారు.

జగన్ మాటలు నమ్మి ముస్లిములు మోసపోవద్దు

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ మాటలు నమ్మి ముస్లిం మైనార్టీలు మోసపోవద్దని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ సూచించారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల పక్షపాతి చంద్రబాబు అన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థుల సైకిల్ గుర్తుకు ముస్లింలు ఓటు వేయాలని కోరారు. వైసిపి పాలనలో ముస్లిం మైనార్టీలకు చాలా అన్యాయం జరిగిందన్నారు. ముస్లిం పేద ప్రజలకు ఒక్క పథకం ద్వారా కూడా లబ్ధి జరగలేదని తెలిపారు. ముస్లింలకు ప్రత్యేక పథకం లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని విమర్శించారు. టిడిపి పాలనలో విదేశాల్లో చదివే ముస్లిం విద్యార్థులకు రూ.15 లక్షలు సాయం చేశారన్నారు. టిడిపి పాలనలో విజయవాడ, కడప ప్రాంతాల్లో హజ్‌హౌస్‌లు నిర్మించారన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ఐస్ రజాక్, ఫయాజ్, పీరా సాహెబ్, మహబూబ్ షరీఫ్, పూల అల్లాబకష్, లాడెన్, జబిబుల్లా, ఇలియాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

- తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో సోమవారం నిర్వహించే 44 పోలింగ్ కేంద్రాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో బారికేడ్లు, షేమియానాలు వంటి కనీస వసతులు కల్పించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కావలసిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 44 పోలింగ్ బూత్‌ల్లో 40 వేల 229 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు.

ఇవే నా చివరి ఎన్నికలు.. ఆదరించండి

- ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు




1985 నుండి ఇప్పటివరకు మైదుకూరు నియోజకవర్గం ప్రజలు అండదండగా నిలబడ్డారని, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చివరిసారిగా పోటీలో ఉంటున్నానని, మళ్లీ తనను ఆదరిం చాలని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి కోరారు. ఆ మేరకు శనివారం ఆయిన మాట్లాడుతూ అందరి అభిమానం, అండదండలే తనను ఇప్పటికీ రాజకీయాల్లో చురుగ్గా తిరిగేలా చేస్తున్నాయన్నారు. ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో మైదు కూరు నియోజకవర్గానికి తన శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 ప్రాజెక్టుల ఏర్పాటు దగ్గర నుండి కెసి కాలువ ఆయకట్టుకు రెండు పంటలకు నీరు రప్పించడం మొదలు, మైదుకూరు ఆసుపత్రి నిర్మాణంలోనూ, దాన్ని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంలోనూ కృషి చేశానన్నారు. ప్రతి గ్రామంలోనూ అభి మానులు ఉన్నారని, ఆ అభిమానమే తనను నడిపిస్తున్నందుకు కృతజ్ఞతలన్నారు. మీరిచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని ఏ ప్రభు త్వంలో ఉన్నా, ప్రతి పక్షంలో ఉన్నా, అందరికీ మేలు చేయడమే తన అంతిమ లక్ష్యమంగా పనిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సచి వాలయాలు, ఆర్‌బికేలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు, ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మిం చామన్నారు.



బాలకృష్ణుడి విగ్రహం గుర్తింపు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం వనిపెంట శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో బాలకృష్ణుని విగ్రహం గుర్తించినట్లు రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేష్ శనివారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవ రాయలు కాలంలో ఈ ఆలయంలో మొగసాల మండపాన్ని ముద్ద రాజు కట్టించారు. ఈ మండపం రాతి కట్టడంపై బాలకృష్ణుని ప్రతిమను మహా తేజో విరాజితంగా, కమనీయ శోభితంగా, రమణీయ సమన్వితంగా, రమ్య మోహనంగా చెక్కారని, ఆనాటి శిల్పకళా వైభవానికి నిదర్శనమని ఆయన అన్నారు. చెన్నకేశవ గర్భాలయానికి పక్కగా ఉండే శ్రీలక్ష్మీదేవి గర్భాలయం వెనుకగా నాలుగు గజరాజుల మధ్య ఆడుకునే బాలకృష్ణుని ప్రతిమను అత్యంత సుందరంగా చెక్కారని ఆయన వివరించారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం ప్రహరీకి లోపలి వైపు బాలకృష్ణుడు సర్పంపై నృత్యం చేసే మరొక ప్రతిమ ఉందని రమేష్ తెలిపారు. ఇదే ప్రహరీ వెలుపల వైపు ఒక వృక్షం దగ్గర బాలకృష్ణుడు ఆడుకునే ప్రతిమను ఆనాటి శిల్పులు అద్భుతంగా చెక్కారని రచయిత తెలిపారు.



ఎండిన చెరువులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నియోజకవర్గంలో చెరువులు ఎండిపోయాయి. తీవ్ర వర్షాభావంతో చెరువులు ఎడారిని తలపిస్తున్నాయి. గండి కోట, మైలవరం, వామికొండ, సర్వరాయ సాగర్ జలాశయాలను రైతులు ఆసరా చేసు కొని అరకొరగా ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసి గట్టెక్కించుకున్నారు. జయాద్ కాలంలో మూడవ పంటగా వేసేందుకు రైతు సాహసం చేయలేకపోయాడు. అందుకు కారణం చెరువులన్నీ ఎండిపోయాయి. గుంతలలో తప్ప నీరు కనపడిన పరిస్థితిలో చెరువులున్నాయి. ఖరీఫ్ కాలంలో వర్షాలు తక్కువగా పడడం వల్ల చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. రబీ కాలంలో అసలు వర్షాలే పడలేదు. ఈ పరిస్థితుల్లో జలాశయాల ద్వారా కాలువలకు నీటిని మళ్లించి పంటలు పండించుకున్న పరిస్థితి ఏర్పడింది. కొండాపురం మండలంలో నీటి సమస్య అధికంగా ఉంది. గండికోట ప్రాజెక్టులో నీరు అడుగంటి పోయింది. మైలవరం ప్రాజెక్టులో 0.535 టిఎంసి మాత్రమే నీరు ఉంది. ఎండిన పంటలకు గిట్టుబాటు ధర లేక, ఇన్సూరెన్స్ లేక రైతు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయాడు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేవని వాతావరణం శాఖ తెలిపింది. ఈ ఏడాది వర్షాలు కొంచెం ముందుగా వస్తాయని చెబుతోంది. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. వేడిగాలులు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు వడగాల్పులతో బెంబేలెత్తిపో తున్నారు. ఎండలకు ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి.

అప్రకటిత విద్యుత్ కోతలు..!

అధిక వినియోగమే కారణమంటున్న అధికారులు - రాత్రి వేళల్లో అధికం - అల్లాడిపోతున్న పిల్లలు, వృద్ధులు



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అప్రకటిత విద్యుత్ కోతలతో పిల్లలు, వృద్ధులు అల్లాడుతున్నారు. విద్యుత్ అధిక వినియోగం వల్లే కోతలకు కారణమని అధికారులు చెబుతున్నారు. ఎండలు మండి పోతున్నాయి. ఉదయం 9గంటలు దాటిందంటే సూర్యుడు ఉగ్ర రూపం దాల్చుతున్నాడు. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు హడలెత్తుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇళ్లలో ఫ్యాన్ లేదా కూలర్ కింద కూర్చోని కాస్త సేద తీరుదామంటే కరెంట్ ఉండడం లేదు. అప్రకటిత కోతలతో జనం అల్లాడిపోతున్నారు. వేళా పాళలేని కోతలతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కోతలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేడి, ఉక్కపోతతో ప్రజలు విల విల్లాడి పోతున్నారు. తరచూ విద్యుత సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నా వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా సందర్భంలో కరెంటు సమాచారం తెలు సుకు నేందుకు ఆ శాఖ కార్యాలయాలకు ఫోన్ చేస్తే.. తీసి సమా ధానం చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది ఉన్నారనే ఆరోపణ లున్నాయి. అధిక వినియోగం వల్ల కరెంటు పోవడానికి కారణ మని అధికారులు పేర్కొంటున్నారు. వేసవికాలం కావడం, వేళా పాళాలేని విద్యుత కోతలతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇటీవల కాలంలో పట్టణ ప్రాంతాల్లో గంటల తరబడి కోతలు పెడుతున్నారు. ఏక కాలంలో వివిధ సాకుల పేరుతో అరగంట నుంచి గంట వరకు కోతలు పెడు తున్నారు. ఆ తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా లో ఓల్టేజీ సమస్యతో ఇంట్లో ఏసీలు ఫ్యాన్లు తిరగడం కూడా కష్టంగా మారింది. జనం ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవు తున్నారు. ఇక వృద్ధులు, పిల్లలు ఉన్న ఇళ్లలోని పరిస్థితి దారు ణంగా ఉంటోంది. కరెంట్ బిల్లు మాత్రం అధికంగా వేస్తున్నారు. సరఫరా మాత్రం అంతంత మాత్రమే. సమయానికి బిల్లు కట్టక పోతే కనెక్షన్లు తప్పిస్తామని అధికారులు అంటున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు. అధికారులు వినియోగానికి సరిపడా విద్యుత్ అందించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోతల్లేకుండా సరఫరా చేయాలి

పగలు, రాత్రి అనేతేడా లేకుండా కరెంటు పోతోంది. రోజుకి ఎన్నిసార్లు కరెంటు పోతుందో అర్థం కాని పరిస్థితి. కరెంటు వచ్చిన కొంత సేపటికే మళ్లీ పోతుంది. దీంతో ఉక్కపోత, వేడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చిన్న పిల్లతో మరింత ఇబ్బంది. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయాలి.

- ఉమాదేవి, పులివెందుల, గృహిణి

కోతలు ఎక్కువగా ఉంటున్నాయి

ఎండలు పెరిగిపోయాయి. పగటి వేళల్లో ఇళ్లలో ఉండలేని పరిస్థితి. రాత్రి వేళల్లో వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు కరెంటు తీసేస్తున్నారు. ఈ మధ్య కాలంలో మరి ఎక్కువగా కరెంటు పోతోంది. అనారోగ్యంగా ఉన్నవారు ఉక్కపోతకు తట్టుకోలేక అల్లాడుతున్నారు.

- ఉత్తమ, గృహిణి, పులివెందుల

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం

అధికారికంగా విద్యుత్ కోతలు ఎక్కడ అమలు చేయడం లేదు. అయితే ప్రస్తుతం ఎండలు పెరిగిపోవడంతో వినియోగం పెరిగింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వేళ్లలో ఒక్కోసారి ఒక్కోవిధంగా విద్యుత్ వినియోగం ఉంటోంది. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్న సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫేజ్‌లు పోవడం జరుగుతూంటుంది. ఈ నేపథ్యంలో కరెంటు సరఫరాలో అంతరాయాలు తలెత్తు తున్నాయి. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్సఫార్మర్లు ఏర్పాటు చేయిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా సమస్య ఎక్కువగా ఉంటే తక్షణ చర్యలు తీసుకుంటాం.

- రమేష్, ఎఇ, విద్యుత్ శాఖ, పులివెందుల

స్వేచ్ఛగా ఓటు వేసుకోండి : ఎస్‌పి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సోమవారం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, భయానికిలోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియో గించుకోవాలని ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వేముల మండలం నల్లచెరువు పల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లా డుతూ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోం దన్నారు. ప్రలోభాలు, బెదిరింపులకు భయ పడవద్దని పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రలో భాలు, బెదిరింపులు ఎవరైనా చేస్తే పోలీ సులకు సమాచారం ఇవ్వాలని సూచిం చారు. కార్యక్రమంలో సిఐ గోవిందరెడ్డి, వేముల ఎస్ఐ ధనుంజయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ఎన్నికల రోజు ప్రశాంత వాతావరణం కల్పించి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వేసుకునేలా చూస్తామని ఎస్ఐ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శని వారం గురజాల, నంద్యాలంపల్లె, సిం హాద్రిపురంలో కేంద్ర, రాష్ట్ర, తమిళనాడు పోలీసులు కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఓటు వేసుకునేలా చూస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఏడు నిమిషాల్లోనే సంఘటన స్థలానికి : ఎఎస్‌పి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నియోజక వర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని అడిషనల్ ఎస్‌పి వెంకట రాముడు తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో శనివారం ఆయన విలేక రుల సమా వేశంలో మాట్లాడుతూ నియో జక వర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లు కలిపి 632 కేసుల్లో 3,342 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. 122 వెపన్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ పోలీస్ బృందం 220 గ్రామాల్లో పల్లెనిద్ర, 250 గ్రామాల్లో పల్లెదర్శిని నిర్వహించామన్నారు. ప్రశాంత వాతావ రణంలో ఎన్నికలు నిర్వహించేందుకు 116 చోట్ల ఫ్లాగ్‌మార్చ్, 21 ప్రదేశాల్లో నాకా బందీ నిర్వహిం చామన్నారు. డిఎస్‌పి యశ్వంత్ మాట్లా డుతూ 315 పోలింగ్ కేంద్రాల్లో 120 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తిం చామన్నారు. 71 ప్రాంతాలను కవర్ చేస్తూ అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్ నుండి వచ్చిన బలగాలు పర్యవేక్షణ చేస్తాయన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 288 మద్యం కేసుల్లో 298 మందిపై నమోదు చేసి 1,701లీటర్లను స్వాధీనం చేసుకు న్నామన్నారు. 2,700 లీటర్లను పారబోశా మన్నారు. రెండు కిలోల బంగారం, నాలుగు కిలోల సిల్వర్, రెండు కోట్ల 13 లక్షల నగదును పట్టుకొని సీజ్ చేశామ న్నారు. పోలీస్ బలగాల ప్రకారం 500 మంది సివిల్ ఫోర్స్, 200 మంది సెంట్రల్ ఫోర్సు, 300 మంది ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాళ్లతోపాటు ఒక అడిషనల్ ఎస్పీ, తాను, ట్రైనీ డిఎస్పి శ్రీకాంత్, ఎని మిది మంది సిఐలు, 25 మంది ఎస్ఐలు ఎన్నికల్లో భాగమయ్యామన్నారు. గతంలో 35 రూట్ మొబైల్స్ ఉంటే ప్రస్తుతం 49 రూట్ మొబైల్‌లను ఏర్పాటు చేస్తా మన్నారు. ఏ గ్రామంలోనైనా చిన్నపాటి ఘర్షణ వాతావరణం లేదా సంఘటన జరి గితే ఐదు నుంచి ఏడు నిమిషాల్లో చేరు కొని సమస్యకు పరిష్కారం చూపి స్తామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించే వారి పట్ల సహృ దయ భావన చూపిస్తామన్నారు. అలాకా కుండా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకొని చట్టరీత్యా శిక్షిస్తామ న్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్పి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి వెంకటరాముడు

నా గెలుపు జమ్మలమడుగు చరిత్రకు మలుపు :'అల్లె'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



స్వతంత్ర అభ్యర్థి అల్లె ప్రభావతి

నా గెలుపు జమ్మలమడుగు చరిత్రకు మలుపు అని స్వతంత్ర అభ్యర్థి అల్లె ప్రభావతి పేర్కొన్నారు. స్థానిక పినాకిని పవర్ ప్లాంట్ వద్ద శనివారం ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లా డుతూ 24 ఏళ్ల రాజకీయ అనుభవంతో నేడు స్వతంత్ర అభ్యర్థిగా జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. జమ్మలమడుగు నియోజ కవర్గంలో అల్లె నాగిరెడ్డి ప్రభావతమ్మ కుటుంబం అంటే తెలియని వారు ఉండరన్నారు. తమ కుటుం బం రాజకీయాల్లో సంపాదించింది శూన్యమన్నారు. లాభాపేక్ష, ప్రతిఫలం ఆశించకుండా తమ కుటుం బం రాజకీయం చేసిందన్నారు. నియోజకవర్గంలో దేవగుడి కుటుంబం, పొన్నపురెడ్డి కుటుంబం, ప్రస్తుతం మూలే కుటుంబం వారు రాజకీయాల ద్వారా ఎంత సంపాందించారు.. స్థానిక సహజ వనరులు ఎలా దోచుకున్నారో మీరు చూస్తున్నారు కదాని ఆరోపించారు. కొండాపురం సిఎం రామనాథరెడ్డి, కుండా రామయ్య కుటుంబాలు మాత్రమే రాజకీయంగా అభివృద్ధి చెందలేక పోయాయన్నారు. లాభాపేక్ష లేకుండా ఎమ్మెల్యేగా పనిచేశాయన్నారు. దేవగుడి కుటుంబానికి అధికార దాహం పట్టుకుందని విమర్శించారు. అల్లె కుటుం బాన్ని నమ్ముకున్న వ్యక్తులకు న్యాయం చేయలేక పోతున్నామని, ప్రజల పక్షాన నిలబడ లేకపోతు న్నామని భావించి నేడు పోటీలో ఉన్నామన్నారు. అవినీతి లేని రాజకీయ నాయకురాలిగా ప్రజల గుండెల్లో చిర స్థాయిగా అల్లె ప్రభావతి పేరు నిలబడేందుకు మీ ముందుకు వచ్చానని తెలిపారు. అల్లె కుటుంబం దాతృత్వంలోనే కాదు రాజకీయ సేవలో కూడా ఉత్తమమని నిరూపించుకునేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. మీ అమూల్యమైన ఓటును అల్లె ప్రభావతి గాజులు గుర్తుపై వేసి ఆశీర్వదిస్తారని కోరుతున్నామన్నారు.



ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న అల్లె ప్రభావతి

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

లక్కిరెడ్డిపల్లి : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సిఐ జీవన్ గంగానాథ్ బాబు కోరారు. శనివారం లక్కిరెడ్డిపల్లి సిఐ సర్కిల్ కార్యాల యంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలింగ్ రోజున సిఆర్‌పిసి 1973లోని 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ బూత్ 200 మీటర్ల పరిధిలో గుంపులుగా ఉండరాదన్నారు. ఫలానా వారికి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించడం వంటివి చేయకూడదన్నారు. ఓటర్లకు స్లిప్పులు పంచడం, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తరలించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషిద్ధమన్నారు. హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, కానిస్టే బుల్ రామానుజన్ రెడ్డి, కానిస్టేబుల్ గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలి

అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి/మదనపల్లి

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం రాయచోటి పట్టణంలోని నురానిమసీదువీధి, గుర్రంకొండ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పోలింగ్ కేంద్రాలు, మదనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ఈశ్వరమ్మకాలనీలోని పోలింగ్ కేంద్రాలను కురబలకోట మండలం, మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు ర్యాంపు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్, లైటింగ్ తదితర వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా బార్ కేడిగ్ పటిష్టంగా ఉండాలన్నారు.విభిన్న ప్రతిభావంతులు వంద శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్‌తో పాటుగా బిఎల్ఒలు, విఆర్ఎలు వారికి సహాయకులుగా అందు బాటులో ఉంచాలన్నారు. విభిన్న ప్రతి భావం తులకు వారి సమీపాన ఉన్న పోలింగ్ కేంద్రం లొకేషన్, బిఎల్ఒ లేదా విఆర్ఎ ఫోన్ నెంబర్ వారికి తెలియజేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్ ఉండేలా చర్యలు తీసుకో వాలనిఅధికారులను ఆదేశిం చారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్స్, ఐపాడ్, ట్యాబులు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోనికి తీసు కువెళ్ళడానికి అనుమతిలేదని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్న విషయం ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు.పోలింగ్ కేంద్రా లలో వీడియో కవరేజ్, వెబ్ క్యాసిటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలి పారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీడియో కవరేజ్‌కు సంబం ధించి ఏయే పోలింగ్ కేంద్రంలో వీడియో కవరేజ్, వెబ్ క్యాసిటింగ్ ఏర్పాటు చేసేది వంటి పూర్తి వివరాలను, వీడియో కవరేజ్ చేసే వ్యక్తి పేరు ఫోన్ నెంబర్ల వివరాలను నియో జకవర్గాల రిటన్నింగ్ అధి కారులకు ఇవ్వాలన్నారు. మదనపల్లె జడ్‌పి హైస్కూల్ కురబలకోటలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను పరిశీలించి ఏర్పాట్లు పక డ్బందీగా చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, మదనపల్లి ఆర్‌డిఒ హరిప్రసాద్, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మదనపల్లి : ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న అభిషిక్త్ కిషోర్



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్ని కల నేపథ్యంలో శనివారం అన్నమయ్య జిల్లా డిఎంహెచ్ఒ కొండయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది,హాజరు పట్టికను పరిశీలించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ మనీషా, డాక్టర్ జియా ఉల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి-రామాపురం

ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని 13 గ్రామపంచాయతీలో 32 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని సిఐ గంగాధర్ బాబు, తాసిల్దార్ శ్రీనివాసులు, స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణములో శనివారం సాయంత్రం కూటమి నాయకులు, వైసిపి నాయకులతో వారు ఎన్నికల విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు వేసుకునే విధంగా ఏజెంట్లు చూడాలన్నారు. ప్రజలను ఎలాంటి భయ భ్రాంతులను గురిచేసిన గ్రామ నాయకుల బాధ్యత ఉంటుం దన్నారు. ఏజెంట్ పోలింగ్ కేంద్రంలో ఏజెంట్ గా ఉన్న వ్యక్తి మళ్లీ మళ్లీ బయటికి రాకూడదని భోజనం టైంలో రావాల్సి ఉంటుందన్నారు. వారి స్థానంలో రిలీఫ్ ఏజెంటు ఉండడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు ఎవరి పని వాళ్లు చూసుకుని ప్రజల ద్వారా ఓటు వేపించాలని తెలిపారు.ఏజెంట్లు ఘర్షణలు దిగితే వారిని బయటికి పంపడం జరుగుతుందన్నారు. పోలింగ్ జరిగే కేంద్రాల్లో నలుగురు ఒకచోట ఉండకూడదని గుంపులుగా ఉండకూడ దని అటు ఉన్న యెడల వారిపై చట్టపరమైన చర్య తీసుకుంటామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో ఉన్న గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని ఎవరైనా ఎలాంటి పరిస్థితిలో కూడా నలుగురు కలిసి ఒకచోట ఉండకూడదు అన్నారు

గాలివీడు : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్నిపార్టీల నాయకులు సహకారించాలని లక్కిరెడ్డిపల్లి సిఐ గంగనాథ్‌బాబు పేర్కొన్నారు. మండ లంలోని రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలతో పోలిం గ్ రోజు పాటించవలసిన నియమాల గురించి వారికి వివరించారు.మండలంలో ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ సహ కరించాలని కోరారు. ఒక వేళ ఏదైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరిం చారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్రసాద్ వైసిపి,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుండి ప్రస్తుతం జరగబోవు సాధారణ ఎన్నికల సందర్భంగా బి.కొత్తకోట మండలం నందు సెక్షన్ 144 సిఆర్.పి.సి అమలులో ఉంటుందన్నారు.సెక్షన్ 144 సి.ఆర్.పి.సి అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు, గుంపులుగా ఎక్కడ గాని నిలబడి మాట్లాడరాదన్నారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన యెడల వారిపై చట్ట రీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రామాపురం : రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సిఐ

రాష్ట్రంలో బలంగా ఇండియా వేదిక

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ఇండియా వేదిక బలంగా ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. శనివారం రాజంపేటలోని ఎఐటియుసి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డితో తనకు 1970 నుంచి ఆత్మీయ పరిచయం ఉందని, ఆయనలోని ఒక్క సుగుణం కూడా తన తనయుడు జగన్మోహన్ రెడ్డికి రాలేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి కేంద్ర బిజెపి వద్ద మోకరిల్లి ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్ర అభివృద్ధిని అటకెక్కించారని విమర్శించారు. రాజంపేటలో వైసిపి నాయకుల ఇసుక అక్రమ రవాణా కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకపోయిందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తల్లి, చెల్లి, బాబాయిలను మోసగించి తాను అమాయకుడునని చెప్పుకుంటున్నారని అన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి తన ముఖ్యమంత్రి పదవి కాలంలో కాంగ్రెస్ పార్టీని అధఃపాతాలానికి నెట్టేశారని ఆరోపించారు. ప్రపంచ శాంతి సంఘం నుంచి కడపకు గతంలో అవార్డు దక్కిందని, అటువంటి ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి ఎమ్మెల్యేగా సిపిఐ నుంచి పంజం నరసింహారెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా సిపిఐ ప్రస్థానం ఘనంగా సాగిందని గుర్తు చేశారు. నేడు అదే సిపిఐ నుంచి ఇండియా కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా బుక్కే విశ్వనాథ నాయక్ బరిలో నిలిచారని ఉత్సాహవంతుడు, యువకుడు, మరి ముఖ్యంగా శ్రామిక వర్గం నుంచి వచ్చిన నాయకుడు కావడం చేత పేద ప్రజల గళం చట్టసభలలో వినిపిస్తాడని అన్నారు. విశ్వనాథ్ నాయక్, కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి బషీద్ లను నియోజకవర్గ ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వ రయ్య, జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, చిట్వేలి రవికుమార్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక డేగ కన్ను



కలికిరి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పీలేరు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పీలేరు నియోజకవర్గం ఆర్ఒ, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల అభ్యర్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఒ మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ అభ్యర్థి, వారి జనరల్ ఏజెంట్, పోలింగ్ ఏజెంట్ విధిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వేసవి కారణంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకునే అవకాశం ఉందని అన్నారు. అందుకు ముందుగా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ జరుగుతుందని, అభ్యర్థుల తరపున హాజరయ్యే ఏజెంట్లు ఉదయం 6 గంటల్లోగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు నెంబర్ల వారీగా ఇవిఎంలు కేటాయించడం జరిగిందని, పోలింగ్ నిర్వహణ సందర్భంగా వాటిలో ఎలాంటి సాంకేతికపరమైన సమస్యలు ఉత్పన్నమైనా వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి తమ ఎన్నికల విధుల్లోని సిబ్బంది సిద్ధంగా ఉంటారని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా సాధారణ పోలీసు బందోబస్తుతో పాటు ప్రత్యేక బలగాలతో రక్షణా చర్యలు చేపట్టామని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆర్ఒ తెలియజేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇఆర్ఒ రమా, ఎఆర్ఒ మహబూబ్‌బాషా, వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

కలికిరి: కలికిరిలోని పోలింగ్ కేంద్రాలను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్ని కలను దృష్టిలో పెట్టుకొని ఆయన మెయిన్ స్కూల్, బాయ్స్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ విజయకుమారి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తుకున్న చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఒ సురేష్‌బాబు ఇఒ గురుమోహన్ పాల్గొన్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

చిన్నపాటి వర్షం..రోడ్లపై నీరు

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక పట్టణంలో కురిసిన కొద్దిపాటి వర్షానికే మురుగునీరు రహదా రులపై పరుగులు తీస్తూ ఈ ప్రభుత్వాలు సాధించిన అభివృద్ధిని ఎక్కిరిస్తున్నాయి. ఎప్పుడు వర్షం కురిసినా పీలేరు పట్టణ నడి బొడ్డులోని ఆర్‌టిసి బస్టాండు, బస్టాండ్ బయట రహదారిపై, వారపు సంతకు వెళ్లే మార్గంలో మురుగునీటి కాలువలు ఉప్పొంగి వర్షపు నీటితో రహదారిని ముంచెత్తుతాయి. వాహనాల రాక, పోకలకు, పాదచారులకు, రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ఇది పెద్ద సమస్యగా మారుతుంది. ఇది ఒక్కనాటి సమస్య కాదు, దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యే. ఈ సమస్య పరిష్కారం కోసం స్థానికులు ఎన్నోసార్లు ఎందరో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వళ్లినా ఫలితం మాత్రం సున్నా. పీలేరు ప్రగతి సాధన కోసం తామెంతో చేశామని చెప్పుకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి ఈ మురుగునీరు అద్దం పడు తోంది. ఇకనైనా నేతలు, నాయకులు, ప్రజా ప్రతి నిధులు సొంత లాభం కొంతమాని పీలేరు పట్టణంలో మురుగునీటి సమస్య పరి ష్కారానికి తగిన మార్గం కోసం అన్వేషించి, ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమ స్యను రానున్న కొత్త ప్రభుత్వమైన శాశ్వత పరి ష్కారానికి చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే రావాలి

తంబళ్లపల్లి : బడుగు బలహీన వర్గాలు నిరుపేదల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్ళీ జగన్ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రచార ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. . ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేస్తూ కళ్ళ ఎదుట జరిగిన అభివృద్ధి చూసి రాజంపేట ఎంపీఅభ్యర్థి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు.